ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు



బాప్టిస్ట్ చర్చ్ నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: వరదనీటి నాలా వద్ద ముంపు సమస్య తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని స్ట్రీట్ నం.17 బాప్టిస్ట్ చర్చ్ వీధిలో రూ.43 లక్షలతో చేపట్టిన నాలా పూడికతీత, పైకప్పు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ డీఈ గీతాకుమారి, ఏఈ మురళీతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నాలాలో కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకొచ్చాయని నాలా అధ్వాన్నస్థితికి చేరడం వల్ల నాలా మురుగు ఉప్పొంగుతూ ప్రవహిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి మీటర్ల పొడవునా నాలాను ఆధునీకరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి, నాగులుయాదవ్, సుధాకర్‌గుప్తా, పూసగోరక్‌నాథ్, ఎయిర్‌టెల్ రాజు, బల్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతా



మహంకాళి జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడు భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కుషాల్‌గౌడ్

ముషీరాబాద్: నగరంలో బీజేపీని మరింత బలోపేతం చేసి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని బీజేపీ మహంకాళి జిల్లా నూతన అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచికుమార్ ముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి కుషాల్‌గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో బీజేపీ మహంకాళి జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన భరత్‌గౌడ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ మరింత బలోపేతం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్, ముషీరాబాద్ బీజేవైఎం అధ్యక్షుడు ఆయూష్, నాయకులు సురేష్‌కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం



ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భక్తులు

కవాడిగూడ: కవాడిగూడ విద్యా విహార్ పాఠశాల వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ మహంకాళి దేవాలయంలో సోమవారం అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా జరిగింది. బస్తీవాసులు, భక్తులు మంగళ హారతులతో అమ్మవారిని ఎదుర్కొని ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం భక్తజన సందోహం నడుమ గణపతి హోమం, చండీ హోమం నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రాణ ప్రతిష్ఠ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఆలయ నిర్వాహకులు మాచర్ల అరవింద్, ఆకుల రామ్‌లక్ష్మణ్, రామకృష్ణ, శ్రీధర్, సురేష్ కుమార్, కిరణ్, కుమార్‌తో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

ఒక్కటైన హైదరాబాద్ అబ్బాయి, రష్యా అమ్మాయి



నల్లకుంట: నగరానికి చెందిన ఓ అబ్బాయి, రష్యా దేశానికి చెందిన అమ్మాయి వివాహ బంధంతో ఒకటయ్యారు. ఆదివారం జరిగిన వివాహం ఈ వేడుకలకు వరుడి కుటుంబ సభ్యులు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఆహ్వానించారు. వేడుకలకు హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యే సోమవారం నల్లకుంట విజ్ఞానపురికాలనీలోని వరుడు నివాసానికి వెళ్లి నూతన వధూవరుల(అవినాష్ కార్తీక్, యాన్న)కు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు.

అంబర్‌పేట నేతలకు బ్రేక్!

- పదేళ్లుగా అంబర్‌పేట నేతలే బీజేపీ నగర శాఖకు సారథ్యం
- తాజాగా జూబ్లీహిల్స్‌కు చెందిన లంకల దీపక్‌రెడ్డికి అవకాశం
- ఇప్పటి వరకు బీసీకి పట్టంకట్టే సాహసం చేయని రాష్ట్ర అధిష్ఠానం

అంబర్‌పేట: బీజేపీ నగర అధ్యక్ష పదవికి అంబర్‌పేట నియోజకవర్గానికి ఉన్న సుదీర్ఘ అనుబంధానికి బ్రేక్ పడింది. తాజాగా సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా జూబ్లీహిల్స్‌కు చెందిన లంకల దీపక్‌రెడ్డిని నియమించారు. దీంతో దశాబ్ద కాలంగా అంబర్‌పేట నేతల ప్రాతినిధ్యానికి తాత్కాలికంగా తెరపడినట్లయ్యింది. నగర పార్టీ కార్యాలయం అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోకి వచ్చే బర్కత్‌పుర ప్రాంతంలో ఉండటం అంబర్‌పేటకు చెందిన నేతలే నగర పార్టీ బాధ్యతలు చేపట్టడం యాదృచ్ఛికంగా మారింది. 2012 నుంచి 2025 వరకు ఇందులో మూడేళ్లు మినహా మిగతా కాలమంతా అంబర్‌పేటకు చెందిన నేతలే నగర పార్టీ బాధ్యతల సారథ్యం వహించారు. 2009 నుంచి 2015 వరకు అంబర్‌పేటకు చెందిన బి.వెంకట్‌రెడ్డి గ్రేటర్ అధ్యక్షుడిగా పని చేశారు. అనంతరం మూడేళ్ల కాల పరిమితితో ఎన్.రాంచంద్రరావు బాధ్యతలు చేపట్టారు. 2019 నుంచి అంబర్‌పేటకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు ఇప్పటి వరకు సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. సుదీర్ఘంగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలే సారథ్యం వహించారు.

బీసీయేతరులకే పగ్గాలు...

రాష్ట్ర పార్టీకి నగర శాఖే కీలకం. కీలకమైన నగర శాఖకు దశాబ్దాల తరబడి బీసీయేతరులే సారథ్యం వహిస్తూ వస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి నగర అధ్యక్షుడిగా చింతాల రాంచంద్రరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎన్.రాంచందర్‌రావు, గౌతమ్‌రావు వంటి బీసీయేతరులే బాధ్యతలు చేపట్టారు. నగర శాఖకు బీసీ నాయకుడిని అధ్యక్షుడిగా నియమించేందుకు పార్టీ అధిష్ఠానం సాహసించడం లేదు. బీసీ నినాదానికి ప్రాధాన్యం ఇచ్చిన బీజేపీ నగర శాఖ అధ్యక్షుడిగా బీసీలకు అవకాశం ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.

గ్రేటర్ సెంట్రల్ జిల్లా కీలకం..

గ్రేటర్ హైదరాబాద్‌లో బీజేపీ నాలుగు ప్రాంతాలుగా విభజించి జిల్లా కమిటీలను ఏర్పాటు చేసింది. నాలుగు జిల్లాల్లో సెంట్రల్ జిల్లా కీలకం. సెంట్రల్ జిల్లా పరిధిలో అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, నాంపల్లి నియోజకవర్గాలు వస్తాయి. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సొంత నియోజకవర్గమైన అంబర్‌పేట ఈ పరిధిలో ఉండటంతో అధ్యక్ష ఎన్నికల్లో తనదైన ముద్ర వేసినట్లు పలువురు భావిస్తున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..

- వైభవంగా వసంత పంచమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు
- సరస్వతిమాతకు క్షీరాభిషేకాలు.. వేడుకగా అక్షరాభ్యాసాలు



అమ్మవారి పూజలో ఆలయ చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు



శంకరమఠంలో సరస్వతి అలంకరణలో శారదామాత



న్యూ రామాలయంలో శాకంబరిగా సరస్వతీదేవి



అమ్మవారి సన్నిధిలో ఓ చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు

నల్లకుంట: మాఘ శుద్ధ పంచమి చదువుల తల్లి జ్ఞాన సరస్వతీ దేవి పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా చదువుల తల్లికి ఆవుపాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు.

శంకరమఠంలో..

వసంత పంచమిని పురస్కరించుకొని నల్లకుంట శంకరమఠంలో కొలువుతీరిన శారదాంబ సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు కనువిందు చేసింది. అలాగే మఠం ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య లలితా హోమం నిర్వహించారు. భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు.

నేడు రథ సప్తమి ..

రథ సప్తమిని పురస్కంచుకొని మంగళవారం (నేడు) ఉదయం శంకరమఠంలో సూర్య నమస్కార పూజలు ఉంటాయని మఠంనల్లకుంట బ్రాంచ్ హెడ్ కృష్ణారావు తెలిపారు. అలాగే 8.30 గంటలకు గురుపాదుకా పూజ, షష్ఠి సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం ఉంటుందని చెప్పారు. అనంతరం చండీ పారాయణ ప్రారంభమవుతుందన్నారు.

న్యూ రామాలయంలో అమ్మవారికి క్షీరాభిషేకం..

◆ న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ స్వామి సరస్వతి ఆలయం(న్యూ రామాలయం)లో సోమవారం ఉదయం పండితులు, అర్చకస్వాముల మంత్రోచ్చరణల నడుమ సరస్వతీ మాతకు 108 కలశాల ఆవు పాలతో క్షీరాభిషేకం కావించారు. అనంతరం అమ్మవారిని శాకంబరిగా అలంకరించి కుంకుమార్చనలు చేసి విశేష పూజలు నిర్వహించారు. శాఖంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సరస్వతి దేవి జన్మదినం కావడంతో అమ్మవారి సన్నిధిలో పలువురు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు చేయించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కె. జయంతి, ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.


సరస్వతీ మాతకు సంగీత నీరాజనం..



వీణా వాద్య కచేరితో చదువుల తల్లికి సంగీత నీరాజనం అర్పిస్తున్న పోపూరి శ్రీనివాసశర్మ

నల్లకుంట: నల్లకుంట శివం సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలోని సరస్వతి సంగీత విద్యాలయంలో సోమవారం సాయంత్రం వసంత పంచమిని వేడుకగా నిర్వహించారు. ముందుగా సంగీత విద్యాలయం విద్యార్థులతో కలిసి సరస్వతీమాతకు పూజలు చేశారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసుడు, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాసశర్మ తన మధురమైన వీణా వాద్య కచేరితో చదువుల తల్లికి సంగీత నీరాజనం అర్పించారు. ఈ కార్యక్రమంలో సంగీత శిక్షకురాలు యశస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో అంబర్‌పేట మహంకాళి





మహంకాళి ఆలయంలో వసంత పంచమి వేడుకల్లో బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలో అమ్మవారి ఆలయాల్లో సరస్వతి మాత అలంకరణలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజాలు, రకరకాల మిఠాయిలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట దేవాస్థన సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్



ఎమ్మార్పీఎస్ నేతలకు డప్పులను అందజేస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 7వ తేదీన నగరంలో జరిగే ''లక్ష డప్పులు.. వేల గొంతులు''అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ వంతుగా ఎమ్మార్పీఎస్ నేతలకు డప్పులను సోమవారం దోమలగూడలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, సీనియర్ నాయకులు ఎంసీ మహేందర్ బాబు, బీజేపీ కవాడిగూడ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, పరుశరాములు, బొల్ల రమేష్, బీఆర్ఎస్ నేతలు ఎండీ సాయికృష్ణ, రాజశేఖర్ గౌడ్, ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు దశరత్, ఎల్లయ్య, గద్దె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఫిబ్రవరి 7న లక్ష డప్పులు, వేల గొంతుల మహా ప్రదర్శనకు అనుమతి నిరాకరించడం అంటే మాదిగ సమాజాన్ని విస్మరించడమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మండిపడ్డారు. తక్షణమే మహా ప్రదర్శనకు అనుమతి ఇచ్చి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

◆ సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగల ఐక్యతను చాటే 'లక్ష డప్పులు.. వేల గొంతులు'మహా ప్రదర్శన పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. ప్రతిపక్షాలకు



ధర్నాలు, రాస్తారోకోలు చేసుకోవడానికి అనుమతులు ఇస్తున్న ఈ ప్రభుత్వం తమ పట్ల ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఫిబ్రవరి 7న లక్షలాది మాదిగలు ఖచ్చితంగా హైదరాబాద్‌ను నిర్బంధిస్తారని అన్నారు. అనుమతి ఇచ్చి మాదదిగల పట్ల వివక్ష లేదని నిరూపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి.రమేష్, కె.వెంకట్, వి.చందు, ఎల్.నాగరాజు, రాజేష్ కన్నా, కార్తీక్, సందీప్, మనీదర్, ఫణీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దు

చిక్కడపల్లి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల అయిలన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ కాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు నేరుగా సంక్షేమ పథకాలను అందజేయాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య కార్మికులకు పెన్షన్ సౌకర్యాన్ని 55 సంవత్సరాలకు కల్పించాలని కోరారు. ప్రమాద మరణానికి రూ.10లక్షలు, సహజ మృతికి రూ.5లక్షలు, దహన సంస్కారాలు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.లక్ష పెంచాలన్నారు. బోగస్ కార్డులను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎం.యాదగిరి, వెంకటయ్య, హరిశ్చంద్ర, సంప్, సాయికుమార్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయి'

చిక్కడపల్లి: పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. సత్యసంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సామాజిక మూర్తులు, వైద్యులు, సినీనటులు, కళాకారులకు త్యాగరాయ గానసభలో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన పులవురు ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ప్రముఖులు వంశీ రామరాజు, హనమంతరాయ శర్మ, శంకరనారాయణ, శశిబాల, దైవజ్ఞశర్మ, సుష్మ, వరదరాజస్వామి, ప్రశాంతి, రామకృష్ణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

కాచిగూడ: వేర్వేరు ఘటనల్లో రైలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లికి చెందిన గుమ్మిశెట్టి భీంరావు (49) నేషనల్ పోలీస్ అకాడమీలో కాంట్రాక్టు ఉద్యోగి. బుద్వేల్ – ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు.

మరో ఘటనలో..

వట్టెపల్లికి చెందిన మహ్మద్ రహీం (35) కూరగాయల వ్యాపారి. బుద్వల్-ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం వీరి మృతదేహాలను ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



లక్షల డప్పులు.. వేల గొంతులు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లకుంట: సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్‌ను ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో తాత్సారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఈనెల 7న నిర్వహించ తలపెట్టిన 'లక్షల డప్పులు, వేల గొంతులు'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద 'లక్ష డప్పులు.. వేల గొంతులు'వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఎడవల్లి యాదయ్య మాదిగ, గాలిపల్లి శంకర్ మాదిగ, సంగర్ జాతి సంగ్ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కుమార్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెడివల్లి రఘువరన్ మాదిగ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేజే బాబు, నర్సింగ్‌రావు, గుర్రం ఎల్లయ్య, సురేష్‌కుమార్, రాజేష్, సంజయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంపై వివక్ష

బీఎల్పీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్పీ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తగిన నిధులు కేటాయించకుండా వివక్ష చూపిందన్నారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8 మంది బీజేపీ ఎంపీలు నిధులను సాధించడంలో విఫలం చెందారని అన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి నేటికి లక్షలాది మంది బహుజన శ్రామిక వర్గ ప్రజలకు చెందిన యువతకు ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారని అన్నారు.

◆ ఉపాధి కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గుజరాత్ కార్పొరేట్ గుత్తేదారులకు కాసుల వర్షం కురిపించే విధంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. హైదరాబాద్ నుంచి పూణే, ముంబయికి అదనపు రైళ్లను కేటాయించాలని, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు లింక్ రైల్వే మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



కాచిగూడ బద్రుకా కళాశాలలో మాట్లాడుతున్న ఐక్యరాజ్యసమితికి భారతదేశ మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్

కాచిగూడ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఐక్యరాజ్యసమితికి భారతదేశ మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ అన్నారు. బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ (బీసీసీఏ) ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా సోమవారం 'దౌత్యం – నాయకత్వం'పై ఆయన పాల్గొని ప్రసంగించారు. దౌత్యపరమైన నాయకత్వం వివిధ రూపాలను తీసుకుంటుందని, విశేషమైన వ్యక్తులు, సంఘటనలను మరచిపోకుండా చూసుకోవడానికి విజయాలను గుర్తించడం, జరుపుకోవడం చాలా అవసరమని చెప్పారు. సరైన సమయంలో సరైన ఎంపికలు చేయడం నిజమైన నాయకత్వ లక్షణాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎప్పుడూ ఇలాంటి అవకాశాలను వదులుకోవద్దని, నాయకత్వంలో ముఖ్యంగా రిస్క్‌లను స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బద్రుకా విద్యాసంస్థల చైర్మన్ లక్ష్మీనివాస్‌శర్మ, కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొ. అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డా. మోహన్‌కుమార్, డాక్టర్ ఎం.జానకీరాం, డాక్టర్ పి.వెంకటయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా కుటుంబ సర్వే నివేదిక

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కుటుంబ సర్వే నివేదిక పూర్తిగా తప్పుల తడకగా ఉందని, అందులో బీసీ జనాభాను తగ్గించి చూపించారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆరోపించారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీ జనాభాను తగ్గించి చూపడంపై తక్షణమే సమగ్ర సమీక్ష జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కుటుంబ సర్వే ప్రకారం బీసీల జనాభా 52శాతంగా ఉందన్నారు. ప్రస్తుత కుల గణనలో బీసీల జనాభా 46.25 శాతంగా చూపించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింల జనాభా పెరుగుతుంటే కేవలం బీసీల జనాభా శాతం మాత్రం తగ్గినట్లు చూపించారని ఆయన పేర్కొన్నారు. గతంలో ఓసీల జనాభా 10శాతం లోపే అని చెబుతుండగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకోవడానికి ఇప్పుడు 15.79 శాతంగా చూపించారని ఆయన ఆరోపించారు. 10శాతం కంటే తక్కువ ఉన్న ఓసీలు 15శాతంకు పెరిగితే, బీసీల జనాభా శాతం మాత్రం పెరగకుండా ఎలా ఉంటుందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొనని జనాభాను 10 లక్షలుగా చూపించారని అలాగే విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ వాసుల లెక్కలు తీయలేదని ఆయన వివరించారు. ఈ సర్వే ఫలితాలను తక్షణమే సమీక్షించి పూర్తి పారదర్శకతతో నిజమైన గణాంకాలను వెల్లడించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమం చేయక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, తంగెళ్ళ మూడి నందగోపాల్, మట్ట జయంతి, ఉదయ్, సత్యనారాయణ, ఆర్య, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.